

# నోము

-కొమరవోలు సరోజ
(కెనడా)

తెల్లవారితే శ్రావణ మంగళవారం. తప్పకుండా నోము నోచుకోవాలనీ తెలుగు వారందరినీ పేరంటానికి పిలవాలనీ మహా సరదాగా వుంది శారదమ్మగారి కొత్త కోడలు ప్రత్యూషకి. అదే విషయం చెప్పింది అత్తగారితో. "నువ్వు నోములు నోచుకోవటం నాకూ ఇష్టమే. కానీ తెలుగు వాళ్ళనే పిలవాలంటావా?" శారదమ్మ బట్టలు ఇస్త్రీ చేస్తూనే అడిగింది. "మరి మా అమ్మ దుర్గాపూర్‌లో అలాగే పిలుస్తుంది. నార్త్ అమెరికాలో వున్నా నార్త్ ఇండియాలో వున్నా రిజల్టొకటే కదండీ! నాకూ అలాగే చేద్దామనుంది." ఒక్కడే కొడుకూ, అదృష్ట వశాత్తు ఒక్కతే కోడలు కూడానూ, పైగా తెలుగు పిల్ల. తను ఏరీ కోరీ, ముచ్చట పడి తెచ్చుకున్న ముద్దుల కోడలు కావటం వల్ల ఆమె కోరికను కాదనలేక పోయింది. ఇస్త్రీ చెయ్యటం ఆపి తెలుగు వాళ్ళ టెలిఫోన్ నెంబర్ల పుస్తకం తెచ్చి ఇచ్చింది. పుస్తకం అట్ట ఒంటి రెక్క ఎర్రమందారపువ్వులా వుంది. లోపలి పేజీలు తెల్లగా నంది వర్ధనాల్లా వున్నాయి. అయితే ఒక్కొక్క పేరు మీదా ఒక్కొక్క రంగు మార్కర్‌తో హైలైట్ చేసి వుంది. మొట్ట మొదటి పేరు పసుపు పచ్చని మార్కర్‌తో హైలైట్ చేయటం వల్ల పేరూ, టెలిఫోన్ నెంబరూ స్పష్టంగా కనబడుతోంది. "దీని అర్థం ఏమిటండి?" అడిగింది ప్రత్యూష. చెప్పక తప్పదుగా అనుకుంటూ.... "పసుపు రంగు అంటే ఫరవాలేదని, పిలిస్తే పిలవొచ్చు. వాళ్ళు నన్ను మరీ అంత బాధ పెట్టిన వాళ్ళు కాదని అర్థం. "ఆరెంజ్ కలర్?" "వాళ్ళు బాధ పెట్టడానికి బాగా ప్రయత్నించారు." "ఆకుపచ్చ?" "నిస్సందేహంగా వాళ్ళను ఆహ్వానించవచ్చు. ఎప్పుడూ నన్ను నొప్పించలేదు." "ఎరుపు?"


"నన్ను చాలా కాలం శనిలా పట్టి పీడించిన తెలుగు కుటుంబం."

"లేత నీలం?" నన్ను ఒక మోస్తరుగా అప్‌సెట్ చేసిన వాళ్ళు.

"ముదురు నీలం?"

"ఒకసారి ఆపేక్షగా పువ్వులు పంపిస్తే........ తీసుకు వెళ్ళిన మనిషితోనూ, ఫోన్ చేసి నాతోనూ, ఎవరు పంపమన్నారు? అంటూ పోట్లాడిన గొప్ప సంస్కారి అతను......"

"ఇక్కడ లేత ముదురు నీలాల కలయిక?"



"ఆ గొప్ప సంస్కారి పుత్ర రత్నం. అంతకు మునుపు మీ మామగారు తెలుగు సంఘంలో కమిటీ మెంబరుగా వున్నప్పుడు ఓరోజు మీటింగ్‌కి మన ఇంటికి పిలుస్తూ "బాబూ, మీ అమ్మా నాన్నలను కూడా తీసుకు రమ్మ"ని చెప్పాను. అతను వచ్చాక "అమ్మగారూ వాళ్ళు రాలేదా?" అని అడిగాను.

"యామ్ ఐ నాట్ ఇనఫ్" అని కొట్టినట్లు మాట్లాడాడు. ఆ రోజు నేను పంచరంగుల బూందీ చేసి పాకంలో వేసి... లడ్లు చేయకుండా అలాగే పళ్ళెంలో అందంగా పెట్టాను. మీటింగ్ అయ్యాక ఈటింగ్ సమయంలో ఆ బాబు అదేదో విషం లాగా తన చిటికెన వ్రేలితో ఒక బూందీని పైకెత్తి బలవంతంగా నోట్లో వేసుకున్నాడు." శారదమ్మకు కళ్ళ నీళ్ళాగటం లేదు. ప్రత్యూష ఆ విషయం గమనించనే లేదు.

"ఈ నల్ల మార్కు?"

"వాడు నన్ను త్రెటన్ చేసి..... విపరీతమైన భయానికీ డిప్రెషన్‌కూ గురి చేశాడు. వాడి భార్య దగ్గర నా పుస్తకాలు అంటే నేను రాసినవి రెండు వుండి పోయాయి. ఆ పుస్తకాలు నా దగ్గర ఒక్క కాపీయే వుంది. అవి ఆవిడకోసారి చదువుకోడానికి ఇచ్చాను. ఆ తర్వాతే ఆవిడ భర్త నానాగోల చేసింది. డిప్రెషన్ కొంచం తగ్గాక ఫోన్ చేసి పుస్తకాలు కనిపిస్తాయా? వెదక గలరా? అని ఎంతో వినయంగా అడిగాను "నో, ఫ్రెండ్‌షిప్ ఈజ్ గాన్ ఐస్టఫ్‌డ్ దెమ్ అండ్ త్రూ దెమ్ ఇన్‌టూ గార్బేజ్" అని గట్టిగా అరిచింది. "మంచిది, థ్యాంక్యూ." అని ఫోను పెట్టేశాను. ఆ పుస్తకాలు ఇండియాలో లైబ్రరీల్లో కూడా ఎక్కడా దొరకలేదు. అందువల్ల అడిగితే 'సారీ' చెప్పటం పోయి నన్ను మళ్ళీ డిప్రెషన్‌కు పంపించింది..."

ఆమె గొంతు దుఃఖంతో జీరబోతోంది. అప్పుడు గమనించింది ప్రత్యూష, అత్తగారు బట్టలు ఇస్త్రీ చెయ్యటంలేదు. ఏడుస్తోంది. ఆ లిస్ట్ ఇంక చూడకూడదనుకుంది ప్రత్యూష.

"అత్తయ్యా నన్ను క్షమించండి. మీరు తెలుగు వాళ్ళు వద్దు అన్న మాటకు వెనుక ఇంత ఆవేదన వుందని నాకు తెలియదు."

శారదమ్మకు శరీరం వణుకుతోంది. గుండె దడవస్తోంది. కోడలి సాయంతో నెమ్మదిగా బెడ్ మీద పడుకుంది. కొద్దిగా మంచి నీళ్ళు తెమ్మంది.

మంచి నీళ్ళు తాగినా ఇంకా ఆమెకు స్వస్థత చేకూరలేదు. ప్రత్యూష మటుకూ తనకు తెలియక చేసిన పొరపాటుకు చాలా బాధపడింది.

భర్తా, మామగారు ఇంటికి వచ్చాక బాధగానే విషయం చెప్పింది.

"ఆవిడ ఖర్మ! తెలుగు వాళ్ళూ, సాటి వారూ అంటూ వాళ్ళ వెంట పరిగెత్తి నామాట వినకుండా ఇదిగో ఇలా తయారైంది. ఇప్పుడెవరికట కష్టం?"

విసుగు ధ్వనించింది మూర్తి గారి స్వరంలో.

"ప్రత్యూషా నీకు ముందే చెప్పవలసింది సంగతి" ఈ ఊళ్ళో అమ్మని ఏదో ఒకటి ప్రత్యక్షంగానో పరోక్షంగానో అనని తెలుగు వారి సంఖ్య వేళ్ళ మీద లెక్కించవచ్చు. ఆవిడ మంచితనాన్ని చేతగాని తనం గానూ, నటనగానూ భావించి బాధించిన వాళ్ళే ఎక్కువమంది. తరువాత ఈ దేశం వచ్చాక ఆవిడ గ్రహ స్థితి మారింది. అందుకే అసూయా పరులూ, వ్యంగ్యంగా మాట్లాడే వారూ ఎక్కువైనారు. దానికి తోడు ఊరు కుంటే ఊరా - పేరా అన్నట్లు తగుదునమ్మా అంటూ ప్రతి దానికీ ముందర బయలుదేరటం పదిరోజులు అప్‌సెట్ అవటం అలవాటైంది. సాధ్యమైనంత వరకూ బాధించిన ఆ మనుష్యులను ఆవిడ చూడకుండా, వాళ్ళ గురించి వినకుండా, మాట్లాడకుండా వుండాలనే నా ప్రయత్నం కొంత వరకూ ఫలించి ఆవిడ ఆ విషయంలో మౌనంగా వుండటం అలవాటు చేసుకుంది. నాన్నగారికి తనలోకమే తనది. అమ్మ గ్రహస్థితి మారిందని చెప్పాను కదా! దాన్ని బట్టి ఈ ఊళ్ళో అమ్మను డిప్రెషన్ పాలు చేసిన వాళ్ళు 'ర' అనే అక్షరంతో పేరు మొదలైన వాళ్ళు. ఇక ముందు కూడా ఈ కెనడాలో వున్నంత కాలం ఈ ఊళ్ళో నివసించే 'ర' కారంతో పేరున్న వాళ్ళతో ఆవిడ మాట్లాడకపోవటం, వాళ్ళు ఫోన్ చేస్తే ఆప్యాయంగా వుండకపోవటం మంచిది. అలగే 'స' కార 'గి' కారాలతో కూడా కొద్దిగా ప్రమాదముంది. అమ్మకు కోడలివైనా కూతురివైనా నువ్వే కనుక ఇంక నుంచీ ఆమెను జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత కూడా నీదే" చెప్పాడు నిఖిలేష్.

అర్థమైందనట్లు చూసింది ప్రత్యూష.

❀ ❀ ❀ ❀

ఉదయం ప్రత్యూష నిద్రలేచి క్రిందకి వచ్చేసరికి శారదమ్మ వంట చేసి, పూజకు కావలసిన సరంజామా అంతా దేవుడి దగ్గర పెట్టింది. గత రాత్రి ఆమె అనుభవించిన మానసిక క్షోభకు గుర్తుగా ఆమె కను రెప్పలు వాచి వున్నాయి.

"తొందరగా స్నానం చేసిరామ్మా" చెప్పింది శారదమ్మ

"నాకు నోము నోచుకోవాలని లేదత్తయ్యా"

"సారీ! ప్రత్యూషా. నిన్నటి నా ప్రవర్తనకి బాధపడి పూజ చేసుకోనంటావేమో అనే ఇంత ముందుగా లేచి అన్నీ సిద్ధం చేశాను."

"నేనే మీకు సారీ చెప్పాలి" చెప్పింది ప్రత్యూష.

"నేనే నమ్మా"

"కాదు నేనేనండి."

"సరేలేమ్మా! అయిపోయిందిగదా!" ఇంక మాట్లాడకుండా తలంటు పోసుకుని, పట్టుచీర కట్టుకుని వస్తే మంచిది అనుకుంటూ తిరిగి మేడ మెట్లెక్కింది ప్రత్యూష.


కోడలి చేత చక్కగా పూజ చేయించి తోరం కట్టిన కత్తిని జ్యోతుల పైనుంచి,


"ఈశ్వరా పుత్రునకు గజావతారునకు
పార్వతీ తనయునకు నేడు సన్నుతింతూ"


జయమంగళా! నిత్య శుభ మంగళా" అని పాడుతూ కాటుక పట్టించింది. తరువాత శనగలూ, తాంబూలం పిండివంటలూ వాయనం తీసుకుని,

"ఇస్తువాయనం, పుచ్చుకుంటు వాయనం మొదలైన పద్ధతులన్నీ ఒక్కటి కూడా వదలకుండా స్వచ్ఛమైన తెలుగులో చెప్పుకున్నారొకరికొకరు.

## అమెరికాలో అత్యంత అధిక ఆదాయం గల మహిళ!


టూరి జోసెఫ్‌సన్


రేనా రోవాన్


లిండా వాచ్‌నెర్

యు.ఎస్. సర్జికల్ కార్పొరేషన్ అనే సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ - టూరి జోసెఫ్‌సన్ సంవత్సర ఆదాయం 2,36,00,000 డాలర్లు అంటే మన కరెన్సీలో 70,80,00,000 రూపాయలు. వర్కింగ్ విమన్స్ మేగజైన్ అనే అమెరికా పత్రిక సర్వే ప్రకారం 1991లో టూరి జోసెఫ్‌సన్ టాప్ ఎర్నర్.

తర్వాతి స్థానంలో వున్న రేనా రోవాన్ (జాన్స్ అప్పెరల్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్) ఆదాయం 6,010,000 డాలర్లు అంటే 18,03,00,000 రూపాయలు.

వార్నకో అనే కంపెనీకి చెయిర్ విమన్, ప్రెసిడెంట్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అయిన లిండా వాచ్‌నెర్ వార్షిక ఆదాయం 3,080,000 డాలర్లు అంటే 9,24,00,000 రూపాయలు.

-డి. పద్మజ

సాయంత్రం పేరంటానికి వచ్చిన వాళ్ళందర్నీ చూసి ఆశ్చర్యపోయింది ప్రత్యూష. వాళ్ళందరూ తెలుగు వాళ్ళు! తన మనసు బాధపడకుండా వుండాలని అత్తగారు వాళ్ళని పిలిచిందని ఆమె కర్థం అయింది.

ఆ తరువాత మూడు శ్రావణ మంగళ వారాలూ ఆశ్చర్యపడటం శారదమ్మ వంతయింది. అత్తగారు లేచేసరికే వంటా, పూజా అన్నీ ముగించి, ఆమె స్నానం చేసి రాగానే వాయనం ఇవ్వటం, ఒక్కో వారం ఒక్కో గ్రూపుని పేరంటానికి పిలవటం చేసింది ప్రత్యూష. ఒక వారం మరాఠీ, గుజరాతీ, సింధీ, పంజాబీ వాళ్ళనీ, ఒకవారం చుట్టు ప్రక్కలున్న కెనడియన్లనీ, గ్రీక్, ఇటాలియన్, జ్యూయిష్ వాళ్ళనీ, మరొక వారం జైన్సని, బుద్ధిస్టలనీ ఆహ్వానించటమే కాక శ్రావణ మంగళవారపు కథనూ ఫలితాన్నీ వివరంగా ఇంగ్లీషులో చెప్పి, వాళ్ళకు పండ్లూ, తాంబూలాలూ ఇచ్చింది. అందరూ సంతోషంగా నాన బెట్టిన పచ్చి శనగలతో ఏం చేస్తే బాగుంటుందో రెసిపీ కూడా తెల్సుకుని వెళ్ళారు.

శారదమ్మను సాధ్యమైనంత సంతోషంగా వుండేలా చూస్తోంది ప్రత్యూష. తీరిక ఉన్నప్పుడల్లా అత్తగారితో మాట్లాడి ఆమె చెప్పే వన్నీ జాగ్రత్తగా వింటోంది. భగవద్గీత చదివించుకుని వినేది. అలాగే శారదమ్మ కూడా హిందీ, ఇంగ్లీషు, బెంగాలీ కథలు కోడలి చేత చదివించుకుని వినేది. కోడలు రావటం ఆమెకు చెప్పలేనంత ఆనందంగా వుంది. ఆమె పుట్టింటి వైపు మగపిల్లలు లేరు. ఎప్పుడూ ఆడ పిల్లలకి పెళ్ళిళ్ళు చేయటం అత్తవారిళ్ళకు పంపడం, వాళ్ళ చేత మాటలు పడ్తూ మర్యాదలు చేయటం తప్ప ఒక ఆడపిల్ల తమ ఇంటికి రావటం, తన చేతిలో పని అందుకుని నేను చేస్తాననటం, కాఫీ కలిపి ఇవ్వటం ఆమెకేదో వింత అనుభూతిని కల్గిస్తోంది. కోడలొస్తే ఇంత గొప్పగా వుంటుందని నేనను కోలేదే. మరి మా అత్తగార్కి నేను కూడా ఒకే ఒక్క కోడల్ని. కానీ ఆవిడె ప్పుడూ సాధిస్తూనే వుండేదే! అనుకుంటూ వుంటుంది అప్పుడప్పుడూ. అదే మాట మనసులో వుంచుకోలేక భర్తతో అంది కూడాను. చింత చచ్చినా పులుపు చావలేదనట్లు "నీ మూలంగానే మా అమ్మకు 'హార్ట్ ఎటాక్' వచ్చింది. లేకపోతే కనీసం ఇంకా పాతికేళ్ళన్నా బ్రతికేది" అంటూ ఖస్సుమన్నాడు.

"నాదే బుద్ధి తక్కువ. లేకపోతే ఈ మనిషితో చెప్పడమేమిటి! మార్పు లేని వ్యక్తి, ఆయన తల్లికి పోయేటప్పటికి ఎనిమిది పదులు దాటినయ్" అనుకుందామె.

కాలం వేగంగా నడుస్తోంది. వింటరూ, స్ప్రింగూ, సమ్మర్, ఫాల్ చక్రంలా తిరుగుతున్నాయి. ఆ కాల చక్రంలో ప్రత్యూష ఎన్నో నోములూ, వ్రతాలూ, అట్లతద్దె ఉద్యాపన అన్నీ చేసుకుంది. అట్లతద్దెకి తెల్లవాళ్ళని పిలిచి తెల్లవారు ఝామున భోజనాలు పెట్టింది. బేస్‌మెంట్లో ఉయ్యాల వేసి ముత్తయిదువులను ఉయ్యాల లూపింది. గోరింటాకు పెట్టింది. ఒక పక్క ఉద్యోగం చేస్తూ కూడా ఆమె ఇవ్వన్నీ చేయగలిగిందంటే తెలుగు సంస్కృతి పట్ల ఆమెక్కు మమకారం అని శారదమ్మ మురిసిపోయింది. మొట్ట మొదటి శ్రావణ మంగళ వారం నోము తరువాత ఆ అత్తా కోడళ్ళ మధ్య అక్కడి తెలుగు వాళ్ళ గురించిన సంభాషణ జరగలేదు. ఆవేళ తన అత్తగార్ని అంతగా ఏడిపించిన ఆ ఎర్ర పుస్తకం మరి కనబడ కూడ దనే ఉద్దేశ్యంతో గార్బేజ్‌లో పారేసింది ప్రత్యూష. శారదమ్మ చాలా వరకూ ఆ జనాల మాటలు మర్చిపోయినా అప్పుడప్పుడూ ముల్లులా గుచ్చు కుంటూనే వుంటున్నాయి. ఆ ముల్లు బాధ ఆమెకు మాత్రమే తెలుసు.

••••

తెలుగు వారికి ఎన్నో వ్రతాలూ మరెన్నో నోములూ వున్నాయి. అవన్నీ కుటుంబ శ్రేయస్సు కొరకు పతి కొరకు చేసేవే. మంచి అత్తగారు కావాలని అమ్మాయి ఎలా కోరుకుంటుందో! అలాగే మంచి కోడలు కావాలని అత్తగారు కూడా కోరుకుంటుంది. కోడలు రావటంలో వున్న ఆనందం శారదమ్మ జీవితంలో అంతకు ముందుకానీ తరువాత కానీ మరే విషయంలోనూ లేదంటే అబద్ధం కాదు. అందుకే ఆమె క్రొత్తగా ఒక వ్రతం లాంటిది స్వయంగా రాసింది.

దాని పేరు 'కోడలి కోసం నోము' ఆ నోము ఎవరైతే భక్తి శ్రద్ధలతో చేస్తారో వాళ్ళకి మంచి అనుకూలవతియైన కోడలు వస్తుంది. కోడలు వచ్చిన వారికి సఖ్యత వుంటుంది అని.

"థ్యాంక్యూ! ప్రత్యూషా" చెప్పాడు నిఖిలేష్

"ఎందుకు?"


"ఎందుకేమిటీ నీ నోము పుణ్యమా అని మా అమ్మలో చాలా మార్పు కనిపిస్తోంది.

"నేను కోరుకునేది కూడా అదే కదా!"

"నిఖిల్! మీ అమ్మగారలా అవడానికి మొదటి కారణం బయటి వాళ్ళకి అంటే తెలుగు వాళ్ళకి చాలా ప్రాముఖ్యత ఇవ్వటం, చాలా సెన్సిటివ్ మనిషి. ఆవిడ బయటి వాళ్ళతో కబుర్లు చెప్పాలనుకోవడం మీ నాన్న గారు ఆవిడ మాట వినిపించుకోక పోవటం. ప్రతి దానికీ ఆమెను బ్లేమ్ చెయ్యడం. కనుక అసలు లోపమంతా మీ నాన్నగారిదే. ఈ వయ స్సులో కూడా ఆయన ఆవిడను ఏదో పురుగులా తీసి పారేస్తుంటే నాకెంతో కష్టంగా వుంటుంది. మా నాన్నగారు మా అమ్మ మాటకు చాలా విలువనిస్తారు. నిజంగా చెప్పాలంటే మా అమ్మే మొండిగా వుంటుంది. అలాంటి వాతావరణం నుంచి రావటం వల్ల ననుకుంటా ఒక్కోసారి మీ అమ్మగార్ని మీ నాన్నగారి నుండి విడిపొమ్మని చెప్పాలనిపించేది. కానీ కంట్రోల్ చేసుకున్నాను.

భార్యా భర్తల అన్యోన్యమే ఆరోగ్యానిస్తుంది. అది కొరవడి, ఇలాంటి దేశాల్లో వుంటున్నప్పుడు ఏ ఉద్యోగమూ చేయలేని ఆడవాళ్ళకు ఇలాంటి బాధ తప్పదు. ఇది మీ అమ్మగారి ఒక్కరి సమస్యే కాదు. ఇక్కడ ఎందరో స్త్రీల సమస్య. ఒక స్త్రీగా, కోడలిగా, సోషల్ వర్కర్‌గా నాకు చేతనైనది చేశాను. ఇంత మంచి అత్తగారు దొరకటం నా అదృష్టం. అందుకే ప్రతి ఆదివారం ఉదయం 'శారద నోము' అని ఒక పూజ చేస్తూంటాను. మీరు గమనించలేదేమో. ఆ నోము వల్ల అత్తగారికి పరి పూర్ణ ఆయుఃరారోగ్యాలు లభిస్తుందని నా నమ్మకం. ఈ వ్రత కథ నేనే రాశాను." చెప్పింది ప్రత్యూష.

చిరునవ్వుతో ఆమెని ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నాడు నిఖిల్.



## అపూర్వ ప్రేమ జంట

మూడు దశాబ్దాల క్రితం గర్భవతులకి మార్నింగ్ సిక్‌నెస్ కోసం బ్రిటన్‌లో థాలిడొమైడ్ అనే మందుని ఇచ్చేవారు. ఐతే, ఆ మందు తీసుకున్న వారికి అంగ వైకల్యంతో పిల్లలు పుట్టడం గమ నించాక ఆ మందు రద్దు చేయబడింది. ఇరవై ఎనిమిదేళ్ల టెర్రీ ఒకే కన్నుతో కాళ్లు లేకుండా పుట్టాడు, తన తల్లి కూడా ఆ మందు తీసుకోవడం వల్ల. అంతకు ముందే వివాహమైన ఇరవై తొమ్మిదేళ్ల రోబిన్ తన భర్తని వదిలేసి టెర్రీని వివాహం చేసుకోవడం అద్భుతమైన విషయం. ఈ వివాహాన్ని భగ్నం చెయ్యడానికి రోబిన్ కుటుంబం చేసిన ప్రయత్నాలన్నీ టెర్రీ మీద రోబిన్‌కు గల ప్రేమ ముందు ఆగలేదు.

- డి. పద్మజ